క్లుప్తంగా

డంపింగ్‌యార్డ్ నుండి దుర్వాసన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని దానవాయిగూడెం ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డ్ నుండి గురువారం సాయంత్రం విపరీతమైన దుర్వాసన వెదజల్లినట్లు స్థానికులు వాపోయారు. సాయంత్రం 5 గంటల తర్వాత నుంచి దుర్వాసన ఒక్కసారిగా పెరిగిందని తలుపులు, కిటికీలు వేసి ఇంట్లోనే ఉండిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాపర్తినగర్ బీసీ కాలనీ, వివేకానంద నగర్, టీఎన్జీవోస్ కాలనీ, దానవాయిగూడెం ప్రాంతాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డట్లు తెలిసింది. ఇలానే దుర్వాసన వస్తే స్థానికంగా ఉండలేమంటూ ప్రజలు వాపోయారు. డంపింగ్‌యార్డ్ సమస్యను పరిష్కరించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు.

కాసానికి కూనంనేని పరామర్శ


ఐలయ్యను పరామర్శిస్తున్న కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య తీవ్ర అనారోగ్యంతో ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం నాయకులు కె. నర్సయ్య తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడికి..


పరామర్శిస్తున్న గుండాల కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల కాలుకు గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దబోయిన నాగరాజును ఎస్‌బీఐటీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ గురువారం పరామర్శించారు. చంద్రశేఖర్ రావు, నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రైవేట్ టీచర్లకూ అవార్డులివ్వాలి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు టీచర్లకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓ సోమశేఖర శర్మకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కూడా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, భాస్కర్‌రావు, డేవిడ్ రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ఆయ్
సాయిరాం	తంగలాన్
ఆదిత్య	మారుతినగర్ సుబ్రమణ్యం
శ్రీనివాస	అహో విక్రమార్క
సినీ గెలాక్సీ	కమిటీ కుర్రోళ్లు, డిమాండ్ కాలనీ 2

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	150		20
బీర	46	తోటకూర	3
దొండ	26		20
పొట్లకాయ	30	గోంగూర	5
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	38	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		40
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	40		20
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

మరుగుదొడ్డి పైపుల నుంచి లీకై వస్తున్న నీరు



ఆస్పత్రి పరిసరాల్లో నిలిచిన మురుగునీరు



కంపుకొడుతోంది..!

అధ్వానంగా మాతాశిశు కేంద్రం పరిసరాలు, మరుగుదొడ్లు

పెద్దాస్పత్రిలోని మాతా శిశు కేంద్రం చుట్టుపక్కల పరిసరాలు, మరుగుదొడ్లు అధ్వానంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఇక మరుగుదొడ్డికి సంబంధించిన డ్రెయినేజీ పైపులైన్ పగలడంతో.. ప్రసూతి కోసం వచ్చిన మహిళలు మరుగుదొడ్లకు వెళ్లి వాంతులు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. సరైన డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో పరిసరాల్లోనే మురుగు నీరు నిల్వ ఉంటోంది. ఆ నీటిలోనే చెత్త చెదారం నిల్వ ఉండడంతో కుళ్లిన వాసన వస్తోంది. ఈ వాసన భరించలేక రోగులు, ఆస్పత్రి సిబ్బంది మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్


అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

సిబ్బంది తీరుతో ఇబ్బంది..


దరఖాస్తుదారులు, సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో అనేక పనులపై, సమస్యల పరిష్కారానికి వస్తున్న ప్రజలకు సిబ్బంది తీరు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కొన్ని విభాగాల్లో నియమించిన కొంత మంది సిబ్బంది ప్రజల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరికొందరైతే పని కోసం వచ్చిన వారిని ప్రశ్నలతో బెంబేలెత్తిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గురువారం కొత్త ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఓ వ్యక్తి కేఎంసీలో కంప్యూటర్ ఆపరేటర్‌ను దరఖాస్తు విషయమై అడగగా సర్వర్ నెమ్మదించిందన్నారని, ఓటీపీ చెప్పాలని ఆపారని, ఓటీపీ వచ్చిన తర్వాత ఇప్పుడు కాదు మధ్యాహ్నం 3 గంటలకు వస్తే పని చేసిపెడతామని చెప్పడంతో సదరు వ్యక్తి వెళ్లిపోయాడు. అదేవిధంగా మున్సిపాలిటీ మీసేవలో పని నిమిత్తం వచ్చిన మరో వ్యక్తి దరఖాస్తు రాయడం రాక కార్యాలయంలో దరఖాస్తులు రాసే ఓ సిబ్బంది వెళ్లి అడగగా సిబ్బంది వ్యవహరించిన తీరుతో దరఖాస్తుదారుడికి, సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదే సమయంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ అక్కడకు చేరుకొని దరఖాస్తుదారుడికి నచ్చజెప్పి వివాదాన్ని ముగించి దరఖాస్తు రాయాలని సిబ్బందిని ఆదేశించారు.

దోపిడీకి గురవుతున్న పెసర రైతులు

ఖమ్మంమయూరిసెంటర్: అనేక వ్యయ ప్రయాసాలకోర్చి పెసలు పండించిన రైతులు దళారుల దోపిడీకి గురవుతున్నారని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెసలకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను క్వింటాకు రూ.8,682లు ప్రకటించిందని, స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం చూస్తే ఈ ధర కూడా సరైన పద్ధతిలో నిర్ణయించలేదన్నారు. గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, దళారులు కనీస మద్దతు ధరకు పెసలను కొనుగోలు చేయలేదని, రైతులు క్వింటాకు రూ.3 వేల నుండి రూ.4 వేల వరకు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పెసలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలని, రైతుకు కనీసం మద్దతు ధరతో పాటు రూ.500లు బోనస్ ఇచ్చి, కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

ప్రియదర్శినిలో ఓరియెంటేషన్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ నవీన్‌బాబు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో ఉన్న ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు గురువారం ఓరియెంటేషన్ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థినులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్ మాట్లాడుతూ... విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది కోర్సు పూర్తయ్యే నాటికి ఉద్యోగ నియామక పత్రంతో వెళ్లేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, హెచ్‌ఓడీలు నర్సింహారావు, రమేష్, వెంకటేశ్వరరావు, జి.కుమారస్వామి, విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిట్ల పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో జరిగే టేబుల్ టెన్నిస్ పోటీలకు జిల్లా జట్టుకు జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్ కిట్లు అందజేశారు. జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో రాణించాలని క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వీవీ. ఎస్. సాంబమూర్తి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు


వినతిపత్రం అందజేస్తున్న సురేష్‌నాయక్

ఖమ్మంరూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండలంలోని పెదతండాకు చెందిన పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్యా సురేష్‌నాయక్ గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిశారు. ఏదులాపురం గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సురేష్ తెలిపారు.

కమిషనర్‌కు వినతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 2వ డివిజన్ పరిధిలో ఒక వెంచర్‌కు సంబంధించిన గ్రీన్ బెల్ట్ స్థలంలో కొంతమంది సంఘం పేరుతో నిర్మాణం చేస్తున్నారని, వారిపై చర్యతీసుకోవాలని కోరుతూ డివిజన్ వాసులు గురువారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందించారు. ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రోడ్డులోని బల్లేపల్లిలో ఒక ప్రైవేట్ పాఠశాల వెనకాల భూమిలో వెంచర్ వేశారని, అప్పట్లోనే ఒక చోట 302 గజాలు, మరో చోట 1,270 గజాల చొప్పున గ్రీన్ బెల్ట్‌కు స్థలాలు ఇచ్చారన్నారు. గ్రీన్‌బెల్ట్ స్థలం ఆక్రమదారుల నుంచి పరిరక్షించాలని కోరారు.

తెలుగు భాషా ప్రావీణ్యాన్ని మర్చిపోవద్దు

ఖమ్మంరూరల్: ఉన్నత చదువుల నిమిత్తం ఎన్ని భాషలు నేర్చుకుంటున్నప్పటికీ మాతృ భాష తెలుగు ప్రావీణ్యాన్ని మర్చిపోవద్దని ప్రిన్సిపాల్ డాక్టర్ కుర్నేటి శ్రీనివాసశర్మ అన్నారు. గురువారం మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్డులోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. అతియా బేగం, తెలుగు అధ్యాపకులు ఉషారాణి, లీల, పీడీవై.చామంతి, విజయమ్మ ఉన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


పోటీలో తలపడుతున్న బాలికలు

కూసుమంచి: కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. హెచ్‌ఎం రాయల వీరస్వామి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ పాల్గొన్నారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని గురువారం ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, రాంబ్రహ్మం దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై సెప్టెంబర్ 2న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ కోరారు. గురువారం నగరంలో జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల మెస్‌చార్జీలు రూ.2,500లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాచర్ల భారతి, బి.సాగర్, సైదులు, సురేష్, నరేష్, కల్యాణ్, కిరణ్, రామనాథం పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ అమలు చేసి హామీని నిలబెట్టుకోవాలని, ఈనెల 27న జరిగిన రైతు ఆందోళనకు మద్దతుగా నిలిచిన రైతాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. యాసంగి పంటకైనా రైతు భరోసా అందించాలని కోరారు. నాయకులు మిడికంటి చిన్న వెంకటరెడ్డి, రాంకోటి ఉన్నారు.

ఘనంగా బోనాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని మూడో డివిజన్‌లో గురువారం ముత్యాలమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయికి, ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. కార్పొరేటర్ మలీదు జగన్, మలీదు నాగమణి, రెండవ డివిజన్ కార్పొరేటర్ మల్లీదు వెంకటేశ్వర్లు, హైమావతి, మాజీ ఎంపీపీ బండి సత్యం ,పేర బోయిన వెంకన్న, వీరభద్రం, ఎం నాగయ్యతదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతం

ఖమ్మంగాంధీచౌక్: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం నగరంలోని గుట్టలబజార్ శ్రీ రామకృష్ణ విద్యాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని, పూజా సామగ్రి, నైవేద్య ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 88973 84856ను సంప్రదించవచ్చని తెలిపారు.

గుంటు మల్లన్న ఆలయంలో..

నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ భ్రమరాంబ దేవికి ఉదయం 8:30 గంటలకు విశేష అభిషేకం, కుంకుమార్చన, సాయంత్రం 6:30 గంటలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు తెలిపారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు..


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం: ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లు రోడ్లపై వాహనాలు నడపొద్దని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. నగరంలో మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడుతున్న నేపథ్యంలో గురువారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల రోడ్డుప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ వరుసగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తు పోలీసు వారికి పట్టుబడితే జరిమానా వేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించడం జరిగేదని, ఇక నుంచి డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్ చేసి, వారితో పాటు వారి తల్లిదండ్రులను న్యాయస్థానంలో హాజరుపరిచి శిక్ష / జరిమానా విధించే అవకాశం ఉంటుందన్నారు.. ట్రాఫిక్ సీఐ మోహన్ బాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సైలు రవి, వెంకన్న, సాగర్ పాల్గొన్నారు.

వివరాల నమోదును వినియోగించుకోండి


రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుంటున్న ఏఓ

కూసుమంచి: రేషన్‌కార్డు లేక రుణమాఫీ పొందని రైతులు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వివరాల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూసుమంచి ఏడీఏ సరిత కోరారు. గురువారం డలంలోని జీళ్లచెరువు, నేలపట్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న వివరాల నమోదును పరిశీలించారు. రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామని, రైతులు వారి కుటుంబ సభ్యుల ఆధార్ జిరాక్స్‌లతో వివరాలు ఏఈఓలకు అందజేయాలని సూచించారు. ఏఓ వాణి, ఏఈఓలు రవీందర్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేడు రఘునాథపాలెం రైతువేదికలో..

రఘునాథపాలెం: రఘునాథపాలెం గ్రామ రైతులకు శుక్రవారం స్థానిక రైతువేదికలో కుటుంబసభ్యుల నిర్ధారణ ప్రక్రియ కొనసాగుతుందని మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ పొందని రైతులు ఉదయం 9:30 గంటలకు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు జిరాక్స్‌లు, స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని నింపి సంతకం చేసి కుటుంబ సభ్యులతో రావాలన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ


తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి


నేలకొండపల్లి: మాట్లాడుతున్న వినోద్‌రావు

తిరుమలాయపాలెం: ప్రపంచంలోనే ఎక్కువ మంది సభ్యులు కలిగిన రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని, అతిపెద్ద పార్టీగా అవతరించడానికి ప్రధాన కారణం అంకితభావంతో సిద్ధాంతంపై విధేయత ఉన్న కార్యకర్తలే కారణమని పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బీరోలులో సభ్యత్వ కార్యాచరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2 నుంచి జాతీయస్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, తిరుమలయపాలెం మండలాన్ని సభ్యత్వ నమోదులో ముందు వరుసలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి సభ్యత్వాన్ని సేకరించాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి నరేంద్రరావు, అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీను, మండల గిరిజన మోర్చా అధ్యక్షుడు బోడ బాలాజీ, బూత్ అధ్యక్షులు వీరభద్రం, సునీల్, భిక్షం, వినోద్, సురేష్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి: బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని కొతకొత్తూరులో గురువారం బీజేపీ బూత్ అధ్యక్షుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండలాధ్యక్షుడు మన్నె కృష్ణారావు, ప్రధాన కార్యదర్శులు పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, షేక్ షర్ఫుద్దున్, సయ్యద్ మెహినుద్దీన్, తొగాటి నాగచారి, కందరబోయిన వెంకటరమణ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం హోమియో వైద్యాధికారి డాక్టర్ సంఘమిత్ర ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ఆయూష్ విభాగం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ బాబునాయక్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మంగళ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఫార్మసిస్టులు మాన్‌సింగ్, శ్రీనివాస్, ఉపేందర్, సునీలు, ఆశా కార్యకర్త సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మంచుకొండ ప్రాథమిక వైద్యం కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈర్లపుడి పల్లె దవాఖాన వైద్యరాలు డాక్టర్ శ్రేయ, ఏఎన్ఎంలు దేవిలలితాంబ, రత్నకుమారి, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెం ప్రభుత్వ పాఠశాలలో చదివి పదోతరగతిలో 9.8 పాయింట్లు సాధించిన విద్యార్థి రాకేష్‌కు మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ చలపతిరావు గురువారం రూ.10,116 నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎస్సై పి.సంతోష్, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, ఐకేపీ ఏపీయం అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

నేలకొండపల్లి: పొగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి పోలీసులు గురువారం అప్పగించారు. మండలంలోని అమ్మగూడెం వద్ద ఓ ఫ్యాక్టరీలో పని చేసే ఉద్యోగి ప్రవీణ్‌రెడ్డి తన ఫోన్‌ను వారం రోజుల క్రితం పోయిందని ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి ఎస్సై పి.సంతోష్ బాధితుడికి అందజేశారు. ఏఎస్సై కోడేత్రాచు, సిబ్బంది నాగరాజు, రాజేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా దినోత్సవం


రెజోనెన్స్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీధర్‌రావు


త్రివేణి పాఠశాలలో..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా త్రివేణి పాఠశాలలో స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.